నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
3 నిజామాబాద్, బుధవారం 8 మే 2024 NIZAMABAD

## గంటన్నర కరెంట్ కట్

- నేతలతో కేసీఆర్ మాట్లాడుతున్న సమయంలో..
- జనరేటర్‌పై ఆధారపడిన బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, మే 7 : జిల్లాకేంద్రంలో సోమవారం రాత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో అనంతరం మారుతీనగర్‌లోని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల నివాసంలో బస చేశారు. మంగళవారం ఉదయం ముఖ్యనేతలతో కలిసి మాట్లాడి జిల్లా పరిస్థితులను తెలుసుకున్నారు. ఆ క్రమంలో గంటన్నర పాటు కరెంట్ కట్ చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ ఎస్ఈకి ఫోన్ చేయగా సర్వర్ బీజీ, స్విచ్ఛాఫ్ వచ్చిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

- జిల్లా కావాలనుకునేటోళ్లు బీఆర్ఎస్‌కు ఓటేయ్యండి
- బీఆర్ఎస్ ఎంపీలైతేనే ప్రజల కోసం కొట్లాడుతారు
- కామారెడ్డి రోడ్ షోలో గులాబీ దళపతి కేసీఆర్ వ్యాఖ్యలు
- ఎదురొచ్చి స్వాగతం పలికిన కామారెడ్డి జనం



గులాబీ కండువాలతో నృత్యం చేస్తున్న మహిళలు



భారీ జెండాలతో గులాబీ శ్రేణులు

- ప్రేమగా.. ఆప్యాయంగా..



**బస్సు యాత్రలో** భాగంగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద కాసేపు ఆగారు. సమీపంలోని హోటల్‌కు వెళ్లి రైతులు, చిన్నారులు, స్థానికులతో ముచ్చటించారు. హోటల్ యజమాని వెంకటరమణయ్య ఇచ్చిన పకోడి తిన్నారు. తన దగ్గరికి వచ్చిన చిన్నారులకు అప్యాయంగా పకోడి తినిపించారు. చాయ్ తాగి, రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా గులాబీ బాస్‌తో సెల్ఫీ దిగేందుకు యువకులు, అభిమానులు పోటీపడ్డారు. ఆయన ఓపికగా వారితో ఫొటోలు దిగారు. కేసీఆర్ వెంట నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

–ఇందల్వాయి, మే 7





మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పక్కన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ తదితరులు

# కామారెడ్డి జిల్లా ఉండాల్నా.. పోవాల్నా?

## జిల్లాలను రద్దు చేస్తే ప్రజల పక్షాన యుద్ధం చేస్తాం

నిజామాబాద్, మే 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి: కామారెడ్డి జిల్లా ఉండాల్నా... పోవాల్నా అంటూ కేసీఆర్ ప్రజలను అడిగారు. కొత్త జిల్లాలను రేవంత్ రెడ్డి తీసేస్తా అంటున్నాడని కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బస్సు యాత్రలో వివరించారు. జిల్లాను కాపాడుకుంటారా... పోగొట్టుకుంటారా మీ ఇష్టం అని కేసీఆర్ చెప్పారు. కామారెడ్డి జిల్లా ఉండాలంటే కచ్చితంగా జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలవాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీలైతేనే కొట్లాడుతారని, మన భవిష్యత్తు కోసం పోరాడుతారని వివరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు అద్భుత స్పందన వచ్చింది. భారీ జన సందోహం మధ్య నిజాంసాగర్ చౌరస్తా నుంచి జేపీఎన్ రోడ్డు వరకు కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగింది. జేపీఎన్ రోడ్డులో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. నరేంద్రమోదీ ఈ దేశ ప్రధానిగా పదేండ్లుగా 150 హామీలిస్తే ఒక్క హామీ అమలు కాలేదన్నారు. సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అంటూ సత్యనాశ్ చేశారన్నారు.

**ఉద్యమకారుడు గాలి అనిల్‌కుమార్..**

ఐదు నెలలకు ముందు తెలంగాణ రాష్ట్రం ఎట్లా ఉండే... ఈ ఐదు నెలల్లోనే ఇంత ఆగం ఎందుకయ్యిందో ఒక్కసారి ఆలోచన చేయాలని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్రహ్మాండంగా రెప్పపాటుకూడా పోకుండా వచ్చిన కరెంట్... ఇవాళ ఎందుకు పోతున్నదని, ఇవే కాదు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన, ప్రజలకు ఉపయోగపడే అన్ని రకాల పనులనూ కాంగ్రెసోళ్లు నిలిపివేస్తున్నారని వివరించారు. మంచినీళ్లు రాక... సాగు నీళ్లు రాక... కష్టపడి పండించిన పంటను కొనేటోళ్లు లేక రైతులు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మీ దగ్గర బీజేపీ ఎమ్మెల్యేను గెలిపించినందుకు ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.30లక్షలు వేసిండంటా నిజమేనా అంటూ చమత్కరించారు. దీనికి రాలేదంటూ జనాలు చెప్పారు. ఏ వచ్చిందంట కదా...? అంటూ మళ్లీ ప్రశ్నించారు. రూ.30లక్షలు కాదు కదా రూపాయి కూడా రాలేదని చెప్పడంతో ఇదీ బీజేపీ పరిస్థితి అంటూ వాస్తవ పరిస్థితిని కేసీఆర్ ఎత్తిచూపారు. మోదీ పాలనలో అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట మంటగలిసిందన్నారు. తెలంగాణకు ఏనాడూ ప్రధానిగా మోదీ మంచి పని చేయలేదని, తల్లిని చంపి బిడ్డను బతికించిండ్రు అని దిక్కుమాలిన మాటలతో విషం చిమ్మారన్నారు. ఎంతసేపూ మత విద్వేషం పెట్టుడు... గందరగోళమే మినహా మంచి పనులే చేయలేదన్నారు. బీజేపీ పనికి రాదని, ఓటు వేసినా వేస్ట్ అన్నారు. జహీరాబాద్ లోక్‌సభలో బీజేపీకి మూడో స్థానమే దిక్కు అన్నారు. ఉద్యమకారుడు, వినయ, విధేయత కలిగిన గాలి అనిల్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, దఫేదార్ రాజు పాల్గొన్నారు.

**పోరాటాల గడ్డ.. కామారెడ్డి**

తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ప్రాంతం కామారెడ్డి అని, ఎంతో చైతన్యవంతమైన ప్రాంతమని కేసీఆర్ కితాబునిచ్చారు. పోరాటాల గడ్డ కామారెడ్డి అంటూ చెప్పారు. పోలీస్ కిష్టయ్య తుపాకీతో ప్రాణాలు తీసుకుని తెలంగాణ కోసం అమరుడు అయ్యారని గుర్తు చేశారు. అడ్డగోలు హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కామారెడ్డిలో పంటలు పెద్ద ఎత్తున ఎండిపోయాయన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ రెప్పపాటు కూడా పోలేదని, ఇప్పుడు ఏం మాయ రోగం వచ్చిందన్నారు. కేంద్రంలో ముమ్మాటికీ సంకీర్ణ ప్రభుత్వమే వస్తుందన్నారు. గోదావరి నదిని నరేంద్రమోదీ మళ్లీ ఎత్తుకొని పోయి అన్యాయం చేస్తా అంటున్నాడని, మరి గోదావరిని ఎత్తుకొని పోతా అంటే ఊకుందమా అని కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ఈ ముఖ్యమంత్రి కుయ్ లేదు కుక్కు లేదని, ఏం మాట్లాడడం లేదని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ఈ రోజు బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కాపాడాలన్నా.. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడాలన్నా.. నదుల నీళ్లలో మన హక్కులు కాపాడాలన్నా. ఢిల్లీ నుంచి నిధులు తేవాలన్నా... మనం బతకాలన్నా... తప్పకుండా బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలన్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జేపీఎన్ రోడ్‌లో నిర్వహించిన బస్సు యాత్రలో భాగంగా హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు